# మరదలినే హత్యచేసిన కామాంధుడు

ప్రేమకు కళ్ళు వుండవు అంటారు. కాని బుర్ర కూడ వుండదని ఈ వాస్తవ కథ నిరూపిస్తుంది.

ఢిల్లీకి ఆరు మైళ్ళలో వున్న ఒక గ్రామంలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు ఇస్మాయిల్. రెండు మూడు నెలలకు ఒకసారి ఢిల్లీవచ్చి జుమ్మా మసీదు దగ్గర వున్న ఒక పెద్ద దుకాణం నుంచి సరుకులు కొనుక్కు వెళ్తూ వుంటాడు. ఆ దుకాణదారుడి కొడుకు యాకూబ్ ఇస్మాయిల్ వయసు వాడు. ఇద్దరూ స్నేహితులు. సరుకులు కొనడానికి వచ్చిన రోజు రాత్రి ఇస్మాయిల్ ఢిల్లీలోనే వుండిపోయేవాడు.

ఆరోజు సాయంత్రం ఇద్దరూ ఇస్మాయిల్ దిగిన లాడ్జి గదిలో తాగుతూ కూర్చున్నారు. ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పుకున్నారు. ఇంతలో యాకూబ్ ఏదో గుర్తువచ్చి చివ్వున లేచి నిల్చున్నాడు.

"ఇంత త్వరగా ఎక్కడికి?'' ఇస్మాయిల్ అడిగాడు.

''మర్చిపోయాను, మా నాన్న మా అత్తయ్యకు ఏదో చెప్పమన్నాడు వెళ్ళాలి"

"నేనూ వస్తాను పద! అటునుంచి సినిమాకు వెళదాం!" అన్నాడు ఇస్మాయిల్.

ఇద్దరూ బయలుదేరారు. యాకూబ్ అత్త మేనల్లుడ్ని సంతోషంగా ఆహ్వానించింది. యాకూబ్ ఇస్మాయిల్‌ని పరిచయం చేశాడు.

"షకీ! రెండు చాయ్ తీసుకురా! యాకూబ్ అన్నయ్య వచ్చాడు" అంటూ కేక వేసింది ఖైరున్నీసా (యాకూబ్ అత్తయ్య)

పది నిముషాల్లో షకీలా ఒక ట్రేలో రెండు టీ కప్పులు తెచ్చింది. యాకూబ్‌కు ఇస్మాయిల్‌కూ ఇచ్చింది.

ఇస్మాయిల్ షకీలా ముఖం మీది నుంచి కళ్ళు మరల్చుకోలేక పోతున్నాడు. అత్తా అల్లుడూ కబుర్లలో వున్నారు. షకీలాకు అతను అలా చూస్తూంటే ఏదోగా అన్పించి త్వరగా లోపలకు వెళ్ళిపోయింది.

బయటికి వచ్చాక ''ఆపిల్ల ఎవరు?'' అడిగాడు ఇస్మాయిల్.

''ఎవరూ? ఓ షకీలా గురించా? మా అత్తయ్య కూతురు." అన్నాడు యాకూబ్.

''చాలా అందంగా వుంది'' అన్నాడు ఇస్మాయిల్. యాకూబ్ మౌనంగా నడుస్తున్నాడు.

"నిక్కా అయిందా?"

''ఇంకా కాలేదు. షకీలా కంటే పెద్ద పిల్ల వున్నది. దానిపేరు మదీనా. అది చాలా నల్లగా వుంటుంది. బొత్తిగా బాగుండదు. దాని పెళ్ళి మా అత్తయ్యకు ఒక పెద్ద సమస్యగా తయారైంది. పెద్ద పిల్లకు చేస్తేగాని చిన్నదానికి చెయ్యడానికి వీలుకాదు కదా?"

ఇస్మాయిల్ నిట్టూర్చాడు. యాకూబ్ అదోలా నవ్వాడు.

ఇస్మాయిల్ యింటికి వచ్చాడు షకీలాను మరవలేకపోతున్నాడు.

రాత్రిళ్లు కళ్లు మూసుకొని షకీలాను తల్చుకుంటూ, కలలు కంటూ గడప సాగాడు.

నెల తిరక్కుండా సరుకుల వంకతో ఢిల్లీ వచ్చాడు. కాని యాకూబ్‌తో "మీ అత్తయ్య ఇంటికి వెళదాం!" అని అడగడానికి మొహమాటం వేసింది.

"షకీలా ఎలా వుంది?'' అడక్కుండా వుండలేకపోయాడు.

''బాగానే వుంది" యాకూబ్ ముభావంగా సమాధానం ఇచ్చాడు.

''మదీనాకు సంబంధం కుదిరిందా?"

"ఇంకా లేదు" క్లుప్తంగా వుంది సమాధానం.

ఇస్మాయిల్ తిరిగి వచ్చాడు. దుకాణంలో కూర్చోలేక పోతున్నాడు. పిచ్చిపట్టినట్టు తిరుగుతున్నాడు. ఏమైనా మరోసారి షకీలాను చూడాలని నిర్ణయించుకున్నాడు. వారం తిరక్కుండా ఢిల్లీ వచ్చాడు

''యాకూబ్ నీకు ఒక విషయం చెప్పాలని వచ్చాను'' అన్నాడు ఇస్మాయిల్.

''ఏమిటి!"

"నేను షధీనాను పెళ్లిచేసుకుంటాను.''

యాకూబ్ ఇస్మాయిల్ ముఖంలోకి విస్మయంగా, నమ్మలేనట్టు చూశాడు.

'ఏమిటి అలా చూస్తావ్? నిజంగానే నేను మదీనాను చేసుకోవడానికి నిర్ణయించుకున్నాను.''

యాకూబ్ సంతోషంతో వుక్కిరి బిక్కిరి అయ్యాడు. స్నేహి తుడ్ని కౌగిలించుకున్నాడు.

"పద అత్తయ్యకు ఈ శుభవార్త చెబుదాం" అంటూ ఇస్మాయిల్ని తీసుకొని యాకూబ్ ఖైరున్నిసా ఇంటికి వెళ్లాడు.

ఖైరున్నిసా ఆనందానికి అంతులేదు. ఇస్మాయిల్ మదీనాను చూడాలని కూడా అడగలేదు. వివాహం నిశ్చయం అయింది. పదిహేను రోజుల్లోనే వివాహం జరిగి పోయింది. వివాహంలో ఇస్మాయిల్ మరదలు పిల్లతో సరసాలు ఆడాడు. షకీలా అతనికి కళ్లముందు కన్పించడమే ఒక పెద్ద వరంగా భావించాడు.

మదీనాను అత్తగారింటికి పంపించారు. ఇస్మాయిల్ మదీనాను సరిగా చూసేవాడు కాదు. అయినా ఆమె అతను తనను వివాహం చేసుకోవడమే ఒక అదృష్టంగా భావించసాగింది.

మదీనాను ఇంటికి తీసుకెళ్లాక పది రోజులకే ఇస్మాయిల్ సరుకులు కొనే నెపంతో ఢిల్లీ వచ్చాడు. అత్తగారింట్లోనే దిగాడు.

"బావా! అక్కయ్యను తీసుకురాలేదేం?" అని అడిగింది షకీలా.

"నువ్వు ఇక్కడ వుండగా మీ అక్కయ్యను తీసుకురావడం ఎందుకూ?" అన్నాడు.

షకీలా సిగ్గుతో ముడుచుకుపోయింది.

'ఛీ! పో! అంటూ లోపలకు తుర్రుమన్నది.

ఇస్మాయిల్ తరచు ఢిల్లీ రాసాగాడు. షకీలా తెలివైన పిల్ల క్రమంగా బావగారి ఆంతర్యాన్ని గ్రహించింది. ముభావంగా దూర దూరంగా వుండసాగింది.

షకీలా ఒక రోజు రాత్రి నమాజు చేసుకొని లేచేసరికి ఇస్మాయిల్ వెనక నుంచి పట్టుకున్నాడు. షకీలా బలంకొద్దీ అతన్ని వదిలించుకుంది. "ఛీ! సిగ్గులేదూ? ఈ సారి నన్ను ముట్టుకో చెబుతాను!'' అని నిప్పులు కక్కుతూ అన్నది. కాని తల్లికి చెప్పలేదు. 1978 ఫిబ్రవరి పదప తేదీ రాత్రి ఈ సంఘటన జరిగింది.

ఇస్మాయిల్ రాత్రంతా నిద్రపోలేదు. పదకొండవ తేదీ ఉదయం బయటికి వెళ్లిపోయాడు. పిచ్చిపట్టిన వాడిలా ఢిల్లీ బజార్లలో తిరిగాడు. ఆ రాత్రి యింటికి రాలేదు. అత్తగారు అల్లుడికి ఎందుకైనా కోపం వచ్చిందేమోనని భయపడసాగింది. షకీలాకు కూడా భయంగానే వున్నది. తన మీద కోపం కొద్దీ అక్కను ఏదైనా చేస్తాడేమోననే భయం పట్టుకుంది.

పన్నెండవ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు ఇస్మాయిల్ పిచ్చివాడిలా యింట్లోకి దూసుకువచ్చాడు. గబాగబా షకీలా గదిలోకి వెళ్లాడు. అతని వాలకం అర్థంకాని అత్తగారు అతని వెనకే వెళ్లింది. స్థాణువులా వాకిట్లోనే ఆగిపోయింది.

ఇస్మాయిల్ కుడిచేతిలో కత్తి వున్నది. ఎడం చేత్తో షకీలాను పట్టుకుని 'ఇవ్వాళ నా మాట వినకపోతే....'

''అమ్మా చూడు!' గావుకేక పెట్టింది షకీలా.

ఖైరున్నిసా కూడా కేకలు పెట్టసాగింది.

"దాన్ని వదిలి ముందు బయటికి పోతావా లేదా!" పెద్దగా అరిచింది అత్తగారు.

"ఛీ! వదులు! ఫో! పశువా!" విసురుగా తోసింది షకీలా.

మరుక్షణంలో షకీలా ఆర్తనాదంతో ఇల్లు ప్రతిధ్వనించింది. ఖైరున్నీసా కేకలు పెడుతూ బయటికి పరిగెత్తింది. కాని గడప ముందు స్పృహ తప్పి పడిపోయింది.

ఇరుగు పొరుగు వచ్చారు.

పోలీసు వ్యాన్ వచ్చింది.

ఖైరున్నిసాకు స్పృహ లేదు.

లోపల గదిలో షకీలా రక్తపు మడుగులో నిర్జీవంగా పడి వున్నది.

ఇస్మాయిల్ కూడా రక్తపు మడుగులోనే వున్నాడు. స్పృహతప్పి వున్నాడు. ఖైరున్నిసానూ, ఇస్మాయిల్ని పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు.

ఖైరున్నిసా త్వరలోనే కోలుకున్నది.

ఇస్మాయిల్ రెండు రోజులు ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో వున్నాడు. రక్తం ఎక్కించారు. క్రమంగా కోలుకున్నాడు.

"నేను షకీలా ప్రేమతో పిచ్చివాడినై పోయాను. ప్రేమ గుడ్డిది అంటారు. కాని దానికి బుద్ధి కూడా వుండదు. ఏదో రకంగా ఆమెను పొందాలనుకున్నాను. అందుకే ఆమె అక్కను వివాహం చేసుకున్నాను. ఆరాత్రి నన్ను చీదరించుకుంది. షకీలా నాకు దక్కుతుందనే ఆశ పూర్తిగా పోయింది. పూర్తిగా పిచ్చి పట్టినట్టే అయింది. పదకొండవ తేదీ అంతా ఢిల్లీ బజార్లలో తిరిగాను. ఒకచోట కూర్చోలేదు. ఒకచోట నిలపలేను. చివరకు షకీలా బ్రతికి వుంటే నాకు శాంతి దొరకదనే నిర్ణయానికి వచ్చాను. బలవంతంగా లొంగదీసుకోవాలనుకున్నాను. అది

కూడా సాధ్యం కాకపోతే షకీలా బ్రతికి వుండటానికి వీల్లేదనిపించింది. కత్తి కొన్నాను. షకీలా కత్తిచూసి భయపడింది. కాని నాకు లొంగడానికి అంగీకరించలేదు. తల్లీ కూతుళ్ళు అరవసాగారు. పిచ్చి కోపం వచ్చింది షకీలాను కసితీరా పొడిచాను. తీరా రక్తపు మడుగులో పడి వున్న నా ప్రియురాల్ని చూసి దుఃఖం ఆపుకోలేకపోయాను. ఆత్మహత్య చేసు కొనే ప్రయత్నంలో కడుపులో అదే కత్తితో పొడుచుకున్నాను. స్పృహ తప్పి పడిపోయాను. కాని చావలేదు." అంటూ కోర్టులో తన అపరా ధాన్ని అంగీకరించాడు ఇస్మాయిల్.

6-12-1978న సెషన్స్ జడ్జి ఇస్మాయిల్‌కు జన్మ ఖైదును విధించారు.